క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న దాతలు

బీచ్‌రోడ్డు : దివంగత నటుడు, సూపర్‌స్టార్ కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైజాగ్ ప్రొఫైల్ గ్రీన్ సిటీ హోమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వైజాగ్ ప్రొఫైల్ గ్రీన్ సిటీ హోమ్స్ డైరెక్టర్ సురేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామాజిక బాధ్యత, కమ్యూనిటీ సంక్షేమానికి తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. లెజెండరీ నటుల జన్మదిన రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించనున్నామన్నారు.

సందడిగా ఓపెన్ జిమ్‌లు


ముడసర్లోవ వద్ద ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువత, మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు సందడిగా మారుతున్నాయి. ఉదయం , సాయంత్రం వేళల్లో జిమ్‌ల్లోని వ్యాయామ పరికరాలను యువత, వృద్ధులు, మహిళలు వినియోగించుకుంటున్నారు. ఆరిలోవ ప్రాంతంలో సంజయ్‌గాంధీ కాలనీ, పెదగదిలి, ముడసర్లోవ, ఆరిలోవ కాలనీ, వివేకానందనగర్ పార్కు తదితర చోట్ల జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. వాటిలో రోజూ యువకులు, మహిళలు ఆరోగ్యం కోసం వ్యాయామం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో ఎక్కువగా పిల్లలు పరికరాలతో వ్యాయామం చేస్తూ ఆడుకుంటున్నారు.

హనుమజ్జయంతి పూజలకు సిద్ధం



ఏయూక్యాంపస్: హనుమజ్జయంతి పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించడానికి తూర్పు నియోజకవర్గంలోని ఆలయాలు సిద్ధమయ్యాయి. కిర్లంపూడి లేఅవుట్‌లోని లలితా సుందరేశ్వర పీఠం, పెదవాల్తేరు వెంకటేశ్వర స్వామి ఆలయం, ఈస్ట్ పాయింట్ కాలనీ షిర్డీ సాయి మందిర ప్రాంగణంలో ఉన్న హనుమంతుడికి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి అభిషేకాలు, తమల పత్ర, సింధూరార్చనలు జరుపుతారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు.

మండువేసవిలో.. చల్లటి నేస్తాలు


చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకుంటున్న పాదచారులు, వాహన చోదకులు


పాత వెంకోజీపాలెం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

దప్పికతో ఉన్న వారికి మంచినీళ్లు ఇచ్చి సేదదీర్చటం ఎంతో పుణ్యకార్యం. వెనుకటి కాలంలో ఎండన పడి దారిన పోయే వారికి చల్ల పోయటం సర్వసాధారణం. ఈ రోజుల్లో చలివేంద్రాల ఏర్పాటుకు అదే నాంది. ఎంతో మంది దాతలు.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. చల్లని మజ్జిగ, మంచినీరు, రస్నా వంటివి అందజేస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు.

- ప్రజల దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు
- ఎండలో తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వస్తున్న వారికి అవే ఆధారం
- సేదదీరుతున్న వాహన చోదకులు, పాదచారులు

మద్దిలపాలెం: వారం రోజులుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. భానుడి భగభగలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనులపై బయటికి వెళ్లేందుకు కూడా ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు దాతలు.. సంస్థల ప్రతినిధులు స్వచ్ఛందంగా మజ్జిగ, చల్లని మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటికి వచ్చే వాహన చోదకులు, పాదచారులకు ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

దాతలు, సంస్థల చలవతో..

వేసవి ప్రారంభం కాగానే చాలా చోట్ల దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కొబ్బరాకులు, తాటాకులతో చలువ పందిళ్లు నిర్మించి, వాటి కింద కొత్త కుండలతో మజ్జిగ, మంచినీరు, రస్నా ప్రజలకు అందిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యాయి. మద్దిలపాలెం, వెంకోజీపాలెం, కేఆర్‌ఎం కాలనీ, సీతమ్మధార వంటి ప్రాంతాల్లో చాలా మంది చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు.


కేఆర్‌ఎం కాలనీలోని వరసిద్ధి వినాయక దేవాలయం వద్ద మజ్జిగ పంపిణీ

మా అమ్మగారి జ్ఞాపకార్థం



మా అమ్మగారి జ్ఞాపకార్థం నేను మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశాను. అది గమనించిన కొంత మంది తాము కూడా భాగస్వాములం అవుతాం.. కొనసాగించమని చెప్పారు. దీంతో నెల రోజులుగా నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నాం. ఇటు వచ్చే వాహన చోదకులు, పాదచారులకు చల్లటి మంచినీటితో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమం చేయటం చాలా ఆనందంగా ఉంది. ప్రజల ఆదరణ బాగుంది.

– శరగడం సుధాకర్, పాతవెంకోజీపాలెం

ఎండన పడి వచ్చిన వారికి ఎంతో ఉపయోగం



మండే ఎండల్లో మాలాంటి పెద్ద వారికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరం. దారిన పోయే వారికి చల్ల పోయడం పెద్దల కాలం నుంచే ఉంది. చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఆ సంస్కృతిని కొనసాగించటం అభినందనీయం. నేను స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో సాయం చేస్తున్నాను. చాలా మంది దాహార్తి తీర్చటంలో గల సంతృప్తి మాటల్లో చెప్పలేం.

– కామాక్షి, హెచ్‌బీ కాలనీ

ప్రజలకు ప్రయోజనకరం



ఎండా కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయటం మంచి కార్యక్రమం. అత్యవసర పనులపై బయటికి వచ్చే వారికి చల్లని మంచి నీరు, మజ్జిగ వంటివి అందజేసి వారి దాహార్తి తీర్చే పుణ్యకార్యం ఎంతో మంది చేస్తున్నారు. అది చాలా మంచిది. ఈ సేవలను అందరూ వినియోగించుకోవాలి. దుర్వినియోగం చేయరాదు. చలివేంద్రాల వల్ల వాహన చోదకులు, పాదచారులకు ఉపశమనం కలుగుతుంది.

– కాళ్ల పద్మావతి, టీచర్

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సత్కారం


ఉద్యోగ విరమణ చేసిన వీఎంఆర్‌డీఏ సిబ్బందిని సత్కరిస్తున్న అధికారులు


శంకరరావు దంపతులను సత్కరిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు అటెండర్లను సంస్థ అధికారులు శుక్రవారం సన్మానించారు. సంస్థలో ఒ.నారాయణరావు, ఇ.అప్పలరాజు, నూరమ్మ అటెండర్లుగా ఉద్యోగం చేసి శుక్రవారం విరమణ పొందారు. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు వీరి సేవలను కొనియాడారు. ముగ్గురిని సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శంకరరావు సేవలు విశిష్టమైనవి..

బీచ్‌రోడ్డు: జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌కు సుదీర్ఘకాలంగా శంకరరావు విశిష్ట సేవలందించారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ కొనియాడారు. శుక్రవారం శంకరరావు పదవీ విరమణ సందర్భంగా సతీ సమేతంగా ఆయనను కార్యాలయం సిబ్బంది ఘనంగా సత్కరించారు. శేష జీవితం ఆనందమయం కావాలని అందరూ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది కిరణ్, రవి పాల్గొన్నారు.

12 నుంచి ఉచిత యోగా శిబిరం

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 12న ఉచిత యోగా శిబిరం ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 12 నుంచి 21వ తేదీ వరకు యోగా శిబిరం జరుగుతుందన్నారు. యోగాచార్యుడు బుడ్డిగ సత్యనారాయణ ఆధ్వర్యంలో అభ్యాసకులకు శిక్షణ ఇస్తారని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు శిక్షణ జరుగుతుందన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు, జీవన శైలి, ఆధ్యాత్మిక విషయాలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఆలయంలో సిబ్బందితో పాటు 97045 47560 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. యోగా శిక్షణను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

జూనియర్ ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు


సీట్లు పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న రూపవతి

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించారని, ఈ కౌన్సెలింగ్ ఉమ్మడి జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్ రూపవతి చైర్మన్‌గా వ్యవహరించారని మేహాద్రి గెడ్డ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ మృదుల ప్రియదర్శిని తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 7 మహిళా గురుకులాల్లో జూనియర్ ఇంటర్‌లో సీట్ల భర్తీకి అడ్మిషన్ కౌన్సెలింగ్ స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. జిల్లలో మేహాద్రి గెడ్డ, సీహెచ్ మధురవాడ, నక్కపల్లి, కోనాం తాళ్లపాలెం, నర్సీపట్నం, కొక్కిరాపల్లి గురుకులాల్లో 73 సీట్లకు గాను సుమారు 200 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ ఖాళీలు మెరిట్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా భర్తీ చేశారు. పలు గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ జి.గ్రేస్, టి నాగమణి, కె.సువర్ణ రత్న కుమారి, సీహెచ్ హిమవతి కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు రక్తపాటు, మధుమేహం, నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. న్యూలైఫ్, రక్తనిధి, ఓమ్నీ ఆర్కే, ఐ విజన్ సంస్థలు, కాలనీ యువత పాల్గొన్నారు.

డాక్టర్ బాబ్జీకి బాల సాహిత్య సేవారత్న అవార్డు


డాక్టర్ వరప్రసాద్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ బాబ్జీ

మద్దిలపాలెం: మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, కవి, రచయిత, కళాకారుడు డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి మరో అవార్డు దక్కింది. హైదరాబాద్ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సేవారత్నం అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, డాక్టర్ వరప్రసాద్ రెడ్డి చేతులమీదుగా శుక్రవారం ఆయన ఈ అవార్డును స్వీకరించారు. తనకు ప్రతిష్టాత్మక పురస్కారం అందించిన సారస్వత పరిషత్ ప్రతినిధులకు డాక్టర్ బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు చెందిన వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ఆయన్ని అభినందించారు.

పొగాకుతో జీవితాలు నాశనం



ర్యాలీ నిర్వహిస్తున్న విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు

అగనంపూడి: పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఖైనీ వంటి క్యాన్సర్ కారకాలకు యువత దూరంగా ఉండాలని విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని ఫార్మా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు, ఖైనీ, గుట్కాలను కొంతమంది యువత ఫ్యాషన్‌గా భావిస్తున్నారన్నారు. నేటి యువత ఆహారపు అలవాట్ల వల్ల, ఇటువంటి క్యాన్సర్ కారకాలు తీసుకోవడం వల్ల త్వరగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లో, పెద్దలకు అవగాహన కల్పించాల్సిన యువతే వీటికి బానిసలు కావడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇప్పటికైనా యువతలో మార్పు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాపు జగ్గరాజుపేట, యాదవ జగ్గరాజుపేటల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో సత్యలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

విశేషంగా సుందరకాండ పారాయణ

సింహాచలం: సింహగిరి మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6.30 గంటలకు స్వామికి పంచామృతాభిషేకం, 7గంటలకు సహస్రనామార్చన, ఉదయం 9 నుంచి శ్రీరామ పట్టాభిషేక సర్గపారాయణ, 9.30గంటలకు పూర్ణాహుతి నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు స్వామికి అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. మహిళలు సామూహికంగా సుందరకాండ పారాయణ చేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పర్యావరణహితంగా జీవిద్దాం


కార్యక్రమంలో పాల్గొన్న ముకుందరావు తదితరులు

ఏయూక్యాంపస్: ప్రతి వ్యక్తి పర్యావరణహితంగా జీవించడం అలవరచుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎంవీపీ కాలనీలోని సమతా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ తమ కర్తవ్యంగా భావించినపుడే పూర్తిస్థాయిలో ఫలితాలు వస్తాయన్నారు. ఈ ఏడాది మన భూమి నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వ్యక్తి 10 మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం బాధ్యతగా స్వీకరించాలని కోరారు. విశాఖను ఒక సామాజిక వనంగా మార్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రకృతి ఆధారిత పంటలు పెంచాలి

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.ఎస్.ఆర్.సి.మూర్తి మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు పండించే వారికి ప్రోత్సాహం అందించడం అవసరమన్నారు. ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు స్ఫూర్తిని ఇవ్వడం, తెలియజేయడం, అమలు చేయడం ద్వారా పర్యావరణ సంరక్షణలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. సమత కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు రాజీ ప్రవీణ, గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, కళాశాల అధ్యాపకులు శ్రీదేవి, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి కృష్ణకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్‌లో బడ్డీల విక్రయానికి అడ్డుకట్ట


విశాలాక్షినగర్ బీచ్ రోడ్డు పక్కన పొక్లెయిన్‌తో తొలగిస్తున్న బడ్డీ

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో అనధికార బడ్డీల విక్రయాలకు జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు అడ్డుకట్ట వేశారు. ఇక్కడ రోడ్డు పక్కన జీవీఎంసీ స్థలంలో బడ్డీలు వెలసినంతవరకు మీనమేషాలు లెక్కబెట్టిన అధికారులు.. స్థానికులు ఫిర్యాదులతో జూలు విదిల్చారు. వివరాలిలా.. జోడుగుళ్లపాలెం నుంచి వైఎస్సార్ సీవ్యూ పాయింట్(సీతకొండ బీచ్)కు వెళ్లే బీచ్ రోడ్డును ఆనుకొని విశాలాక్షినగర్ మలుపు వద్ద కొన్ని నెలల కిందట కొందరు అనధికారికంగా 10 బడ్డీలు ఏర్పాటు చేశారు. వాటిని కొందరు అద్దెలకు ఇస్తుండగా.. మరికొందరు విక్రయాలకు పెట్టారు. బడ్డీ రూ.లక్ష చొప్పున విక్రయించే ప్రయత్నం చేశారు. మరికొందరు నెలకు రూ.10 వేల చొప్పున అద్దెకు ఇస్తున్నారు. వీటిని రోడ్డు పక్కన ఏర్పాటు చేయడం వల్ల స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు గురవుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్‌తోపాటు మత్తు పదార్థాలు, సిగిరెట్లు, ఖైనీ ప్యాకెట్లు సైతం విక్రయించేవారు. దీంతో ఇక్కడ ప్రతి రోజు సాయంత్రం సమయంలో హడావిడిగా మారిపోతోంది. వాహన చోదకులు అటుగా వెళ్లడానికి భయపడేవారు. దీంతో స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఇటీవల ఫిర్యాదులు చేశారు. స్పందించిన అధికారుల ఆదేశాలతో శుక్రవారం జోన్–2 టౌన్ ప్లానింగ్ సిబ్బంది పొక్లెయిన్లతో అక్కడ ఉన్న 10 బడ్డీలను తొలగించారు. దీంతో ఇక్కడ బడ్డీల విక్రయాలకు, అద్దెలకు అడ్డుకట్టపడిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్


ఈ కార్వో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న అతిథులతో చిన్నారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో నెల రోజులుగా అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రైల్ క్లబ్‌లో ముగింపు వేడుకలు నిర్వహించారు. సమ్మర్ క్యాంప్‌లో వివిధ వయసు గ్రూప్‌ల విద్యార్థినీ, విద్యార్థులకు కరాటే, యోగా, ఫోనెటిక్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, డాన్స్, కీ బోర్డ్, సంగీతం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా సమ్మర్ క్యాంప్ ఉంటుందని, దీనిని నిర్వహించిన ఈకార్వోను ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన చిన్నారులకు డీఆర్‌ఎం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్లు కవితాగుప్తా, మధుస్మిత సాహు తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఫ్రైడే–డ్రైడే అమలు

- ప్రజా భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన
- జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్


పూల కుండీ ట్రేలో పెరుగుతున్న దోమ లార్వాలను పరిశీలిస్తున్న తులసీరాజ్

సీతంపేట: నగరంలోని ప్రతి సచివాలయం పరిధిలో పూర్తిస్థాయిలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం అమలయ్యేలా చూడాలని సిబ్బందిని జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ ఆదేశించారు. 25వ వార్డు శాంతిపురంలో శుక్రవారం ఉదయం ఫ్రైడే–డ్రైడే అమలు తీరును క్షేత్రస్థాయిలో ఆమె పర్యవేక్షించారు. జీవీఎంసీ, మలేరియా సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. దోమ లార్వాలు పెరుగుతున్న ప్రదేశాలను గుర్తించారు. ఈ సందర్భంగా తులసీరాజ్ మాట్లాడుతూ ఫ్రైడే–డ్రైడేను పటిష్టంగా అమలు చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టి తద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాల నియంత్రించవచ్చని చెప్పారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండి నీటి నిల్వల్లో దోమ లార్వాలను నాశనం చేయాలన్నారు. వారానికి ఒక సారి నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములు, సంపులు, ట్యాంకులు శుభ్రం చేసి మళ్లీ నీరు పట్టుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజల అవగాహన, భాగస్వామ్యంతోనే దోమల వృద్ధిని అరికట్టగలమన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, హెల్త్ అసిస్టెంట్లు ఎల్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరెడ్డి, శివ, ఏఎస్‌ఎం, ఆశా, యాంటీ లార్వా సిబ్బంది పాల్గొన్నారు.

‘పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి’

కొమ్మాది: పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సమగ్ర శిక్ష డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గీత అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ, కె.నగరపాలెం ప్రాంతాల్లో పర్యటించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను బడికి పంపించాలని వివరించారు. పిల్లలను భవిత స్కూల్ పంపడం వలన ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్, హోమ్‌బేస్డ్ అలవెన్సులు ఇస్తామని తెలిపారు. ఇప్పటివరకు భీమిలి మండలంలో 47 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌ఈఓ శివరాణి తదితరులు పాల్గొన్నారు.